క్లుప్తంగా

ఎస్పీని కలిసిన గుడ్లవల్లేరు ఎస్ఐ



కోనేరుసెంటర్: గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన జి.సత్యనారాయణ సోమవారం జిల్లా ఎస్పీ పి.జాషువాను మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను ఎస్పీ అభినందించారు. విధులను బాధ్యతతో నిర్వర్తించాలని, ఎలాంటి ఆరోపణలు పోలీసులపై రాకుండా బాధ్యతలను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అందించేందుకు కృషి చేయాలని ఈసందర్భంగా ఎస్పీ సత్యనారాయణకు సూచించారు.

రేపటి సాధికార యాత్ర విజయవంతానికి పిలుపు



మచిలీపట్నంటౌన్: నగరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ బుధవారం నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ నగరంలోని పలు డివిజన్లలో నాయకులు సోమవారం ఆహ్వాన కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ఆహ్వాన పత్రికలను అందజేశారు. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మునిసిపల్ కార్యాలయం వద్ద జరిగే సాధికార యాత్ర బహిరంగ సభకు తరలిరావాలని కోరారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

పర్రచివర(నాగాయలంక): కార్తిక సోమవారాన్ని గ్రామానికి చెందిన 50 మంది వృద్ధులకు అవనిగడ్డకు చెందిన శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిశోర్ నాయుడు రగ్గులు పంపిణీ చేశారు. రేమాల శ్రీనివాసరావు, రాఘవయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్నియాల సేకరణ



యల్లయ్య(ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని 10వ వార్డుకు చెందిన సబ్బినేని యల్లయ్య(80)అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించగా ఆయన కార్నియాలను సోమవారం తాడిగడపలోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. ఆయన భార్య కృష్ణకుమారి, కుమారులు రామ్మోహన్‌రావు, బాలవర్ధనరావు మృతుడి నేత్రాలు దానం చేసి మరో ఇద్దరికి చూపు ఇవ్వాలనే సంకల్పంతో స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఈమేరకు స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణలకు సమాచారం అందించారు. మృతుడి బంధువు ఉప్పల ప్రసాద్ సహకారంతో డాక్టర్ సాయి బృందం మృతుడి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు. ఇప్పటి వరకు 192 కార్నియాలను సేకరించామని రఘుశేఖర్ చెప్పారు.

పింఛన్‌దారుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: నగరంలోని 36వ డివిజన్‌లో వైఎస్సార్ సామాజిక పింఛన్ లబ్ధిదారు కాండ్రు దమయంతి ఇటీవల మృతి చెందింది. తోటి పింఛన్‌దారులు ప్రతి ఒక్కరూ రూ.100 అందజేసిన రూ.32,400లు దమయంతి కుమార్తె అక్కల స్వరూపరాణికి సోమవారం అందజేశారు. ఆ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్‌తో కలిసి నగదును అందించారు. రాంప్రసాద్ మాట్లాడుతూ డివిజన్‌లోని సామాజిక పింఛన్‌దారులు మృతి చెందితే తోటి పింఛన్‌దారులు ఆ నెలలో రూ.100 చొప్పున సేకరించి వచ్చిన నగదును మృతి చెందిన పింఛన్‌దారుని కుటుంబానికి అందిస్తుండటం అభినందనీయమన్నారు. ఆ నగదు ఆయా కుటుంబాలకు ఎంతో ఆసరా కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆ డివిజన్ సచివాలయ కన్వీనర్ దార్ల చెన్నకేశవరావు, యువజన విభాగం అధ్యక్షుడు దమ్ము కేశవ, సీపీఎం నాయకుడు చిరువోలు జయరావు పాల్గొన్నారు.

మోహనరంగా విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని వినతి

నాగాయలంక: దివంగత మాజీ శాసనసభ్యుడు వంగవీటి మోహనరంగారావు విగ్రహాన్ని మండల కేంద్రమైన నాగాయలంకలో ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని మండల శ్రీకృష్ణ దేవరాయ కాపు సంక్షేమ సాంఘిక సేవా సంఘం కోరింది. ఈమేరకు సంఘం అధ్యక్షుడు భోగాది సోమశేఖర్(చిన్నారి) నేతృత్వంలో పలువురు కమిటీ సభ్యులు సోమవారం గ్రామ పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ ఏఎస్ఆర్ చంద్రమూర్తికి వినతి పత్రం అందచేశారు. అనంతరం సోమశేఖర్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా చిరస్మరణీయుడైన వంగవీటి రంగా సమాజ హితం కోరుకున్న మహనీయుడన్నారు. సంఘం తరఫున ఆయన విగ్రహం నాగాయలంకలో ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరామన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, ఆర్‌కెనాయుడు, సంఘ పెద్ద బండ్రెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక స్నానాలతో పులకించిన కృష్ణాతీరం

- భక్తులతో జనసంద్రమైన బీచ్‌లు, పుష్కర ఘాట్‌లు
- పరమశివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు



రామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



నాగాయలంకలో నక్షత్ర హారతులిస్తున్న అర్చకులు



మంగినపూడి బీచ్ వద్ద ఉన్న శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



పాండురంగస్వామి ఆలయంలో ఉత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

కోనేరుసెంటర్: కార్తిక పుణ్యస్నానాలతో కృష్ణాతీరం సోమవారం పులకించింది. మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల పరిధిలో కార్తిక పౌర్ణమి సహా సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు ఉదయాన్నే పుణ్య స్నానాలు ఆచరించి, విశేష పూజలు నిర్వహించారు. దీంతో మంగినపూడి బీచ్ జనసంద్రమైంది. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు అశేష సంఖ్యలో తరలిరావటంతో బీచ్ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. పితృదేవులకు తర్పణాలు అర్పించడం, కార్తిక దీపారాధన, గోపూజలు, ఇసుకతో వినాయకుడు, నందీశ్వరుడు, శివలింగాలకు ప్రత్యేక పూజలు చేయటంతో బీచ్ ప్రాంగణమంతా ఆధ్యాత్మికత సంతరించుకుంది. పోలీసుల పహారా, అధికారుల పర్యవేక్షణల మధ్య పుణ్యస్నానాలు ప్రశాంతంగా ముగిశాయి. డ్వామా పీడీ జి.వి.సూర్యనారాయణ మంగినపూడి బీచ్ వద్ద జ్యోతిని వెలిగించి ఉదయం 5 గంటలకు పుణ్యస్నానాలను ప్రారంభించారు. దత్త రామేశ్వరం వద్ద ఉన్న 12 మంచినీటి బావుల్లోని నీటితో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిలకలపూడిలోని పాండురంగస్వామి దర్శించుకున్నారు. దాదాపు 2.50 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు డ్వామా పీడీ తెలిపారు. ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు డీఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మంగినపూడి బీచ్ ప్రధాన రోడ్డు వెంబడి వాహనాలను వెళ్లనీయకుండా తాళ్లపాలెం పరిధిలోని సత్తెనపాలెం మీదుగా దారిని మళ్లించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మంగినపూడి బీచ్ వద్ద వలంటీర్లు భక్తులకు సేవలు అందించారు.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి పాండురంగస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. భక్తులు సముద్రస్నానాలు ఆచరించి స్వామి వారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. స్వామి వారి పల్లకీ, గోపాలకాల ఉత్సవాలను నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు టేకి నరసింహం పర్యవేక్షించారు. నగరంలోని పలు శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉన్న 35 అడుగుల శివుని విగ్రహం వద్ద భక్తులు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు. అలాగే భోజ్జిల్లిపేట, చింతగుంటపాలెం నాగేశ్వరస్వామి ఆలయాలు, గాంధీబొమ్మ శివాలయం, జోడుగుళ్ల, గొడుగుపేట, బచ్చుపేట శివాలయాలు, సుబ్రహ్మణ్యం చెరువు వద్ద ఉన్న శివాలయంలో భక్తులు దీపాలు వెలిగించారు.

శ్రీరామపాదక్షేత్రం పుష్కర ఘాట్ వద్ద..

నాగాయలంక: నాగాయలంక శ్రీరామపాదక్షేత్రం పుష్కర ఘాట్ వద్ద తెల్లవారుజాము 3 గంటల నుంచే భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. శ్రీరామలింగేశ్వర స్వామి మండపంలో శివలింగానికి భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీయ అభిషేకాలు చేసుకుని ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. స్నానాల అనంతరం భక్తులు నదిఒడ్డున ప్రమిదల్లో దీపాలు వెలిగించారు. సామూహిక కార్తిక దీప ప్రమిదల ప్రదర్శన, నవహారతులు, కార్తిక వన సమారాధన కార్యక్రమాలకు సోమవారం రాత్రి భక్తులు పోటెత్తారు. 3 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల బుజ్జి, తలశిల రఘుశేఖర్ పర్యవేక్షించారు. స్థానిక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం నది ఒడ్డున ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టించారు. గ్రామంలోని ఆర్యవైశ్యసంఘం నేతృత్వంలోని శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమేత శ్రీనగరేశ్వస్వామి ఆలయంలో 31వ వార్షిక కార్తిక మాసోత్సవాల్లో భాగంగా గోత్రనామాలతో పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో అర్చకులు కొల్లిపర సుబ్బారావు పూజాధికములు నిర్వహించారు.

మోపిదేవిలో..



మోపిదేవి సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం, దక్షిణకాశీగా వెల్లుగొందుతున్న పెదకళ్లేపల్లిలో వేం చేసి ఉన్న శ్రీదుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, దీపారాధనలు నిర్వహించారు. ఆలయాల ఏసీ సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆకట్టుకున్న సైకత శివలింగాలు..

కోడూరు(అవనిగడ్డ): పరమశివుడికి ప్రతిరూపంగా పూజించే సైకత శివలింగాలను తయారు చేసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. సైకత శివలింగాలను సిద్ధం చేసి, సముద్ర జలాలతో అభిషేకాలు చేశారు. కార్తిక దీపాలను వెలిగించి భక్తిభావం చాటుకున్నారు.

కనులపండువగా లక్ష బిల్వార్చన

కోడూరు: కోడూరులోని పార్వతి సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో లింగాకారుడికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. వేదపండితుల మంత్రోచరణల నడుమ లక్ష బిల్వార్చనను కనులపండువగా జరిపారు. లింగారెడ్డిపాలెంలోని గోకర్ణేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వ రుద్రాభిషేకాలను జరిపి, నాగాభరణాన్ని అలంకరించారు. మాచవరంలోని రామలింగేశ్వరస్వామి, హంసలదీవి, విశ్వనాథపల్లిలో కాశీవిశ్వేశ్వరస్వామి, పిట్టల్లంక బాల నాగేశ్వరస్వామి, వేణుగోపాలపురం అమరలింగేశ్వర స్వామి, సాలెంపాలెంలోని ఆగస్త్యేశ్వరస్వామివారి ఆలయాల్లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించేందుకు తరలివచ్చారు. భక్తులు ఆకాశ జ్యోతులకు పూజలు చేసి, అర్చకులకు స్వయంపాకాలు అందించారు.

హరహర శంభోశంకర

పెడన: శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారి దేవస్థానంతో పాటు పట్టణంతో పాటు మండలంలోని పలు శివక్షేత్రాల్లో హరహర శంభోశంకర నామంతో మార్మోగాయి. ఆలయంలో దీపాలు వెలగించారు. దేవదాయశాఖ సిబ్బందితో పాటు ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పౌర్ణమి చంద్రుడు ఊసులాడే..



కనకదుర్గమ్మ దేవస్థానం మీదుగా చంద్రుడు

నాగాయలంక: శ్రీరామ పాదక్షేత్రంలో ఆదివారం రాత్రి పున్నమి చంద్రుడు కార్తిక జ్యోతులతో ఊసులాడినట్లు కనిపించిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్‌శర్మ, శిష్టా సుబ్రహమణ్యశాస్త్రి, శిష్టా షణ్ముఖ చంద్రశేఖరన్ భక్తులకు నేత్ర పర్వంగా నవహారతులు ప్రదర్శిస్తున్న సమయంలో నిండు పౌర్ణమి చంద్రుడు నేలపై రెపరెప లాడుతున్న కార్తిక దీప జ్యోతులతో పోటీపడుతన్న చందంగా ప్రకాశించిన తీరును సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

కృత్తివెన్నులో..

కృత్తివెన్ను: కృత్తివెన్ను, చినపాండ్రాకలలోని శివాలయాల్లో వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కృత్తివెన్ను శ్రీ దుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. దంపతుల అభిషేకాలతో అభిషేక మండపం నిండిపోయింది.

బంటుమిల్లిలో..

బంటుమిల్లి: శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి. భక్తులు ఉపావాసాలు ఉండి ఉదయం సూర్యోదయానికి ముందు, రాత్రి సూర్యాస్తమయం అనంతరం ఆలయాలు సందర్శించి దీపాలు వెలిగించి స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ఇళ్ల వద్ద నోములు నోచుకున్నారు. భక్తులు అర్చకులకు, పురోహితులకు స్వయంపాకాలు అందజేసి ఆశీర్వాదాలు పొందారు.

గూడూరులో పూజలు

గూడూరు: మండల కేంద్రమైన గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం, కంకటావలోని అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేరస్వామి ఆలయాలలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి నిర్వహించిన దీపోత్సవంలో భక్తులు దీపాలు వెలిగించి వ్రతాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ పాలకవర్గాలు, అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.





కోడూరులో లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న పండితులు



నాగాయలంకలో శివలింగానికి అభిషేకాలు



పెడన శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కృత్తివెన్నులో మూలవిరాట్‌కు క్షీరాభిషేకం

కంకటావలో దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కలెక్టర్ రాజాబాబు పనితీరు ప్రశంసనీయం



కలెక్టర్ రాజాబాబుకు ఆయన చిత్రపటాన్ని అందజేస్తున్న సురేష్‌బాబు తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పనితీరు ప్రశంసనీయమని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. సోమవారం ఆయన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉయ్యూరుకు చెందిన ఉపాధ్యాయుడు పులవర్తి ఎలీషా గీచిన రాజాబాబు చిత్రపటాన్ని ఆయనకు బహుమతిగా అందజేశారు. సురేష్‌బాబు మాట్లాడుతూ బందరు పోర్టు పనులు శరవేగంగా జరిగేందుకు, జిల్లా వ్యాప్తంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు, కలెక్టరేట్ సుందరీకరణతో కలెక్టర్ విశేష సేవలు అందిస్తున్నారన్నారు.

స్పందన కార్యక్రమంలో అర్జీలు ఇచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, నిర్ణయాలను అధికారుల ద్వారా నిబద్ధత, నిజాయితీతో అమలు చేస్తూ సామాన్య ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, మాచవరపు ఆనంద్ పాల్గొన్నారు.

వరి పంటలో దిగుబడి అంచనా

గూడూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో ఈ ఏడాది ఖరీఫ్ దిగుబడులు అంచనా వేశారు. దీనిలో భాగంగా గూడూరు మండల వ్యవసాయ శాఖాధికారి జి.వి.శివప్రసాద్, జిల్లా ప్రణాళికా విభాగం అధికారి గణేష్ కృష్ణ, ఎస్‌ఓ పద్మజ, డీవైఎస్‌ఓ వెంకటేశ్వరరావు, ఏఎస్‌ఓ అరుణ్‌లు గండ్రం గ్రామంలోని రైతు మురళీకృష్ణ పంట పొలంలో దిగుబడి అంచనా వేశారు. శాస్త్రీయ పద్ధతిలో 5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పంట నూర్చి దిగుబడులు లెక్కగట్టారు. వరి రకం ఎంటీయూ 1318 వంగడం ఎకరాకు 39 బస్తాల దిగుబడులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైతులు మురళీకృష్ణ, రమేష్, వీఏఏ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వీ పాలెంలో నేడు సామూహిక పూజలు

రేమాలవారిపాలెం(నాగాయలంక): లోకకల్యాణార్థం స్థానిక శ్రీభక్తాంజనేయస్వామి ప్రతిష్ఠాలయం ప్రాంగణంలో మంగళవారం అష్టోత్తర శత హనుమాన్ చాలీసా పారాయణం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామంలోని జై హనుమాన్ భక్తసేవా సమాజం అధ్యక్షుడు రేమాల రామగోపాల్ సోమవారం తెలిపారు. ఈ విశేష కార్యక్రమాన్ని ఆలయంలో 2004వ సంవత్సరంలో ప్రారంభించగా 19 ఏళ్లుగా ప్రతి మంగళవారం చాలీసా పారాయణం, పూజ నిరంతరాయంగా కొనసాగుతూ ఈ మంగళవారం 1054వ వారంగా సామూహిక విశేష పూజ జరుగుతుందన్నారు. 108 మందికి పైగా మహిళలతో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తదుపరి పూజలో పాల్గొన్న మహిళలు, వివిధ గ్రామాల భక్తులకు మహా అన్నసంతర్పణ ఉంటుందని చెప్పారు.

సుందరీకరణ పనులను వేగవంతం చేయండి

కలెక్టరేట్ ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్ రాజాబాబు



కలెక్టరేట్ ఆవరణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం ఆయన కలెక్టరేట్ ప్రాంగణానికి లోపల, వెలుపల ప్రాంతాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కలెక్టరేట్ ప్రహరీ వెలుపల భాగమంతా పిచ్చిమొక్కలు, మురుగునీటితో నిండి ఉండేందుకు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీరు ఉన్న ప్రాంతంలో మట్టిని తోలించి మెరక చేయాలని సూచించారు. అనంతరం ప్రహరీ చుట్టూ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని వ్యర్థ నీరు అంతా ఈ డ్రెయిన్ల ద్వారా పారేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కలెక్టరేట్ ప్రాంగణంలో డీఎస్‌ఓ కార్యాలయం సమీపంలో ఉన్న ఆడిటోరియం ప్రాంతాన్ని, డీఈఓ కార్యాలయ వెనుకవైపు ప్రాంతాన్ని మెరక చేసి పార్కింగ్ ప్రదేశంగా తీర్చిదిద్దాలన్నారు. జేసీ చాంబర్ వెనుకవైపు భాగంలో ఉన్న మురుగునీరును తోడించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మట్టిని తరలించి మెరక చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ చాంబర్ వద్ద వాహనాలు పార్కింగ్ చేయకుండా ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మీడియా ప్రతినిధులకు ఐఅండ్‌పీఆర్ కార్యాలయం వద్ద ప్రత్యేక సదుపాయాన్ని ఏర్పాటు చేసి అక్కడ వేచి ఉండేలా సౌకర్యాలు కల్పించాలని డీఆర్వోను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీఓ నాగేశ్వరనాయక్, ఉద్యానశాఖ అధికారి జ్యోతి, మైక్రో ఇరిగేషన్ అధికారి విజయలక్ష్మి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎం.భాస్కరరావు, కమిషనర్ చంద్రయ్య పాల్గొన్నారు.

పథకాలు కొనసాగాలంటే జగనే సీఎం కావాలి



పట్టణం 11వ వార్డులో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న మల్లి తదితరులు

పెడన: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనే మళ్లీ సీఎం కావాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి అన్నారు. పట్టణ పరిధిలోని 11వ వార్డులో సోమవారం వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మల్లి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేస్తూ మరలా జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుని సంక్షేమ ఫలాలు లబ్ధి పొందాలంటూ అవగాహన కల్పించారు. అలాగే పెడన ఎమ్మెల్యేగా జోగి రమేష్‌ను గెలిపించుకుని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నాయకులు ప్రజల అభిప్రాయాలు సేకరిస్తూ పర్యటించారు. ఈ పర్యటనలో జేసీఎస్ కన్వీనర్ మతీన్‌ఖాన్, వార్డు ఇన్‌చార్జి కన్వీనర్ ముత్యాల మురళి, వలంటీర్లు సుజాత, ఆంజనేయులు, ప్రసాద్, దినేష్, షాహిన, లక్ష్మి, గృహసారథులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ గ్రామసభలు

గూడూరు: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా మండలంలోని కప్పలదొడ్డి, గండ్రం గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలు అవుతున్న అటల్ పెన్షన్ యోజన, పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ తదితర సంక్షేమ పథకాలపై ఎంపీడీఓ డి.సుబ్బారావు ప్రజలను చైతన్య పరిచారు. పథకాలు లబ్ధి పొందేందుకు ఉండాల్సిన అర్హతలను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్‌లు గుడివాడ వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, యక్కల మాధవి, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సాంబశివరావు తదితరులు

చల్లపల్లి: పూర్వ విద్యార్థి కుటుంబానికి అండగా నిలిచిన సహచర విద్యార్థులు అభినందనీయులని ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ తగిరిశ సాంబశివరావు అన్నారు. గ్రామానికి చెందిన ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థి, జర్నలిస్ట్ కళ్లేపల్లి చంద్ర ఇటీవల మృతి చెందగా, అతని కుటుంబానికి ఎస్ఆర్‌వైఎస్‌సీ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫ్రెండ్స్ 1988–2020 ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం రూ.60,501లు ఆర్థిక సహాయాన్ని అందచేశారు. ఈ సహాయాన్ని స్థానిక సాయినగర్‌లో సాంబశివరావు, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజుల అశ్విన్ కుమార్, బీడీఆర్ ప్రసాద్ చేతులమీదుగా చల్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పేరం మధుసూదనరెడ్డికి అందచేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వేములపల్లి అనిల్‌కుమార్, ఉప్పాల నాంచారయ్య, మోర్ల శివ, మునిపల్లి నాగ మునేంద్రరావు, డాక్టర్ శివప్రసాద్, చేతన్, రావి రాజశేఖర్, జన్ను నాంచారయ్య, ఓగిరాల నాగ మల్లేశ్వరరావు, పెనుమూడి శ్రీను, మహమ్మద్ జిలానీ పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీలపై నేడు ప్రజావేదిక

నాగాయలంక: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై ఆడిట్ నిమిత్తం సామాజిక బృందాలు తనిఖీ పూర్తి చేసిన నేపథ్యంలో మంగళవారం ప్రజావేదిక సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సీహెచ్.శ్రీనివాస్, ఏపీఓ రవికుమార్ సోమవారం తెలిపారు. నాగాయలంకలోని ఉపాధిహామీ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు సంబంధిత జిల్లా అధికారులు మండల ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ఉద్యోగులు ప్రజావేదిక సభలో పాల్గొంటారన్నారు. మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరం రూ.9.42 కోట్లతో జరిగిన ఉపాధి పనులు, రూ.2.27 కోట్లతో జరిగిన పంచాయతీరాజ్ శాఖ పనులకు నిర్దేశించిన షెడ్యూల్ మేరకు సామాజిక తనిఖీ సభ్యులు గ్రామసభల్లో తనిఖీలు చేపడతారని పేర్కొన్నారు.

రేపు బహిరంగ వేలం

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేం చేసి ఉన్న శ్రీరంగనాయకస్వామి ఆలయంలోని ముఖమండపం పాత టేకు కలప దూలాలు, పాత మద్రాసు టెర్రస్‌పై కప్పు తొలగించి తీసుకొనుటకు ఈ నెల 29వ తేదీ బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కె.వి.గోపాలరావు సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జరిగే వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.50 వేలు దరావత్తు చెల్లించాలని చెప్పారు.